ఆదివారం
ప్రజాశక్తి
నవంబర్ 10, 2002

వాడిపోతున్న బాల్యం

హ్యాపీ బర్త్‌డ

(10-11-2002 నుండి 16-11-2002 వరకు)

మోహన్ ప్రసాద్
1సం॥,10.11.2001
రోహిణి-రామమోహన్‌రావు
శ్రీకాకుళం

రేష్మాసృజన
4సం॥, 10.11.1998
దయామణి-పవనమూర్తి
కాజులూరు, తూ॥గో॥

మనోజ్
1సం॥, 10.11.2001
లక్ష్మి-గణేష్
సీలేరు- విశాఖ

మామిడి కృష్ణ భరత్
6సం॥, 11.11.1996
రమాదేవి-ఏడుకొండలు
పెదకాకాని, గుంటూరు

శ్రావ్య మినిత
11-11
విమల-బాలశౌరి
విశాఖ స్టీల్ ప్లాంట్-విశాఖ

గోళ్ల నవీన
9సం॥,11.11.1993
గ్రేస్‌మణి-రాజశేఖర్
సూళ్ళూరుపేట, నెల్లూరు

వై.ఎస్. ప్రియశ్రీ
1సం॥, 11.11.2001
కవిత-శివానంద
మదనపల్లి

జి.లక్ష్మీలావణ్య
2సం॥, 11.11.2000
సుభాషిణి-కృష్ణమూర్తి
యర్రగొండపాలెం, ప్రకాశం

జె.వంశీ
10సం॥, 12.11.1992
శ్రీదేవి- జ్యోతీశ్వరరావు
సోంపేట- శ్రీకాకుళం

శ్రీశ్వేత
8సం॥, 12.11.1994
నవోదయ- రమణ
భద్రాచలం, ఖమ్మం

మోడెం ప్రశాంత్‌గౌడ్
5సం॥,12.11.1997
రేణుక-నర్సయ్యగౌడ్
మంగపేట- వరంగల్

కె.విజయ సాయి కృష్ణవంశీ
2సం॥,13.11.2000
మంగవేణి, రాజు
కాకినాడ

నవ్య
8సం॥,13.11.1994
శాంతి-శ్రీనివాసరావు
జమిస్తాన్‌పూర్-హైద్రాబాద్

ఎం.లక్ష్మి
5సం॥, 13.11.1997
ఆదిలక్ష్మి-నరసింహారావు
రాగోలు -శ్రీకాకుళం

పి.కృష్ణప్రియ
6సం॥, 14.11.1996
కమలమ్మ-కృష్ణమూర్తి
చెన్నేకొత్తపల్లి-అనంతపురం

కొమ్మినేని కిరణ్మయి(పూజ)
నవంబర్-14
వేద-అనిల్
బాపట్ల-గుంటూరు

పి.జగదీష్
4సం॥, 15.11.1998
అనసూయమ్మ-నాగన్న
అమరాపురం-అనంతపురం

నరేందర్‌రెడ్డి
10సం॥,15.11.1992
సుమతి-వెంకట్‌రాంరెడ్డి
నవాబ్‌పేట

మడికి కల్పన
3సం॥, 16.11.1999
శ్యామల-వెంకటరామకృష్ణ
కొత్తూరు-తూ॥గో॥

సుభాషిణి
4సం॥, 16.11.1998
తల్లి: దుర్గాభవాని
కూనవరం-ఖమ్మం



చుక్కలు కలపండి

తాళం చెవులు

నసీరుద్దీన్‌కు చిన్ననాటి మిత్రులు ఇద్దరున్నారు. వీరంతా చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. కలిసి ఆడుకున్నారు. కలిసి తిన్నారు. అంతగా కలిసి వున్న మిత్రులు పెద్దయ్యాక ఎవరి పనుల్లో వారు తీరిక లేకుండా మునిగిపోయారు. ఓసారి ఎలాగైనా ముగ్గురూ కలిసి వారం రోజులైనా గడపాలనుకున్నారు. తతిమ్మా ఇద్దరు మిత్రులు కలిసి నసీరుద్దీన్ ఇంటికి చేరుకున్నారు. కుశల ప్రశ్నలయ్యాక ఆ మాటలు ఈ మాటలు చెప్పుకుంటున్నారు. అలా మాటల మధ్యలో దేవుడి ప్రసక్తి వచ్చింది. 'దేవుడు ప్రత్యక్షమైతే ఏం కోరుకుంటాం' అన్న విషయంమీద ముగ్గురూ అభిప్రాయాలు చెప్పుకుంటున్నారు. మొదట ఓ మిత్రుడు కలుగచేసుకుని 'నా ముందు దేవుడు ప్రత్యక్షమైతే నా ఇల్లంతా వజ్రాలతో నిండిపోవాలని కోరుకుంటాను' అన్నాడు. రెండో మిత్రుడు మాట్లాడుతూ 'నేను నా ఇల్లంతా బంగారంతో నిండిపోవాలని కోరుకుంటాను' అన్నాడు. నసీరుద్దీన్ మాత్రం ఏమీ మాట్లాడలేదు. మిత్రులిద్దరూ నసీరుద్దీన్ ఏం కోరుకుంటాడోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నసీరుద్దీన్ ఎంతకీ ఏం మాట్లాడలేదు. మిత్రులిద్దరూ 'ఏం కోరుకుంటావు నసీరుద్దీన్? త్వరగా చెప్పు. నీవు చాలా తెలివిగలవాడివి. మాకంటే మంచిదేదో కోరుకుంటావు' అన్నారు... 'ఏం లేదు మీ ఇద్దరి ఇళ్ల తాళం చెవులు నాకు ఇమ్మని కోరుకుంటాను' అన్నాడు. అంతే మిత్రులిద్దరికీ నోరు పెగిలితే ఒట్టు.

సేకరణ- **బి.సురేంద్రరావు,**
పదవ తరగతి.

ఈ రోజు మనదే!

'అమ్మా, అమ్మా!' అంటూ బిగ్గరగా పిలుస్తున్న వేణు గొంతు విని అర్చన ముందు గదిలోకి వచ్చింది.

'ఈ రోజు నవంబరు 14 చిల్డ్రన్స్ డే అని చెప్పినా వినకుండా తాతయ్య చూడు, నేను మేడ మెట్లమీద నుంచి దూకుతుంటే అడ్డం పడుతున్నాడు' అన్నాడు వేణు.

'ఔను మరి, అలా దూకితే కాళ్లు విరుగుతాయి కదా?' అన్నాడు తాతయ్య.

'అదంతా నాకు తెలీదు. ఈ రోజు పిల్లల రోజు. అంటే మా ఇష్టం' వేణుతో పాటు వాడి ఫ్రెండ్సు కూడా ఒక్కసారిగా అరిచారు.

'సరేనర్రా ముందు నేను నవంబరు 14 గురించి చెబుతాను. తర్వాత మీ ఇష్టం వచ్చినట్టు చేయండి' అంది అర్చన. 'నవంబరు 14 అంటే నెహ్రూజీ బర్త్‌డే. ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం. అందుకనే ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరపాలని నిర్ణయించారు. మీకు నెహ్రూ ఎవరో తెలుసు కదా. మన మొదటి ప్రధాన మంత్రి. చాలా గొప్ప నాయకుడు..'

'ఔను తెలుసు'.

'నెహ్రూ గారు కూడా చిన్నప్పుడు మీలానే చాలా అల్లరి చేసేవారట. అయితే బాగా చదువుకునేవారు కూడా. అందుకే అంత పెద్ద వారయ్యారు. నేటి బాలలే రేపటి పౌరులు అంటారు కదా. మీరే రేపు ఈ దేశాన్ని నడిపించాలంటే ఇప్పటి నుంచే బాగా అన్నీ తెలుసుకోవాలి. మరి పెద్ద వాళ్లు కూడా మిమ్ములను బాగా చూసుకోవాలని చెప్పేందుకే ఈ బాలల దినోత్సవం. తెలిసిందా?' అంది అర్చన.

'తాతయ్యకు చెప్పు ఆ మాట' వేణు ఉక్రోషంగా అన్నాడు.

'మీరు కూడా మీకన్నా చిన్న పిల్లల పట్ల ప్రేమగా వుండాలి. బయట మనకు ఎంతో మంది పేద పిల్లలు తిండి లేకుండా కనిపిస్తుంటారు. చదువుకునే వయసులో పనులు చేస్తుంటారు. అలాటి వాళ్లను స్నేహితులుగా చూసి సహాయపడాలి. సరైన తిండి లేని పిల్లలు కూడా కోట్ల మంది వుంటారు తెలుసా!' అంది అర్చన.

'ఔనమ్మా, మొన్న చిన్నపిల్లాడు తిండి లేక ఏడుస్తుంటే చూసి నాకూ ఏడుపొచ్చింది. మరి వాళ్లందరికీ తిండి రావాలంటే ఏం చేయాలి?' వేణు అడిగాడు.

'ఏముంది, మీరు బాగా చదువుకొని పైకి రావాలి. ఇతరుల పట్ల దయతో వుండాలి. చదువుతో పాటు అన్ని విషయాలు తెలుసుకుంటూ నెహ్రూ గారిలాగే దేశానికి సేవ చేయాలి. అంతేగాని.. మేడలెక్కి దూకకూడదు...' అని చెప్పింది అర్చన.

వేణు నవ్వుతూ చూశాడు!

(నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా) **-ప్రత్యూష**

కలంస్నేహం

పేరు : ఎ.వినయ్
వయసు : 11 సం॥
చదువు : 6 వ తరగతి (ఇం.మీ)
హాబీలు : టీవీ చూడటం, ఆటలు ఆడడం, బొమ్మలు వేయడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ ఎ.నర్సింగరావు, 1-1-300/45, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : వి.లావణ్య
వయసు : 13సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : ఆటలు ఆడడం, కథలు చదవడం, పాటలు పాడడం, డాన్స్ వేయడం, బొమ్మలు వేయడం
పూర్తి చిరునామా : వి.లావణ్య, డాటరాఫ్ సుబ్బారావు, రాహుల్ స్కూల్, వైకుంఠపురం, చీరాల, ప్రకాశం.

పేరు : కొత్తపల్లి అజయ్
వయసు : 10సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు : కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, సినిమా పాటలకు డ్యాన్సు వేయడం, పాటలు పాడడం, టీవీ చూడడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ కె.శంకరయ్య, శాంతి టాలెంట్ స్కూల్, పత్తికొండ, కర్నూలు.

నిచ్చెన మెట్ల ముచ్చట్లు

రుక్మిణి



"అధికార్లు మామాట అస్సలు వింటం లేదు - మంత్రన్నా, ఎమ్మెల్లేనన్నా కూడా వాండ్లకు సోదిలో లేకుండా పోయింది. అరె... ఎక్కడ ఏ కంట్రాక్టు కుదుర్చుకుందామన్నా నిధుల సంగతేంటో చెప్పరు - అస్సలు మేం ఎవరికీ ఏ పనులు ఇచ్చి చేయించుకుందామనుకున్నా వీలుపడదాయె! మన పార్టీ కార్యకర్తలు ఆవురావురుమని ఆడిపోసుకుంటున్నారు!" మంత్రిగారు చెమట్లు తుడుచుకున్నాడు.

"వేం ఎన్నో పార్టీ కార్యక్రమాలు చేసుకుంటాం... కంట్రాక్టు చేనుకున్నట్లు రానుకుని బిల్లు చేసుకుంటాం... అరె... 'పనిబియ్యం' తరలిస్తే - ఆ మతలబంతా పూసగుచ్చినట్లు ఈ జిల్లా అధికారులు విచారణ మొదలు పెట్టి ఏ ఈకకాఈక పీకితే మా పాక లేచిపోతుంది. లాభం లేదు సార్! అసలు మనం ప్రజాప్రతినిధులం! వాళ్ళు ఉద్యోగస్తులు. అయిదేండ్ల వరకూ జిల్లాను... ఇటు రాష్ట్రాన్ని పాలించేది మేమా.. జీతపురాళ్ళ జీతగాళ్ళా.. కుదర్దు!" ఓ ఎమ్మెల్లేగారు ఆవసోపాలు వడడంతో మరో మంత్రిగారికి మరో పెద్ద అనుమానమే తన్నుకువచ్చి ఆయన చెవిలో గుసగుసగా గొణిగాడు. "నురీ ముందుకెళ్ళమాక.. ప్రజల వద్దకు పాలన... పదిహేడు విడతల జన్మభూములు.. మొదలేసింది బాబు గారేనాయె! వినూత్న వింత విజయవంత పథకం అని ఊదర పెట్టినాం గదా! పనులన్నీ పారదర్శకం అనీ... నీటిపనీ తోట పనీ పూర్తి కాకపోతే తాట వలిచేస్తామనీ, అధికారుల్నే అన్నింటికీ బాధ్యుల్నిచేసి ప్రజల ముందు నిలబెట్టినాం! అదే... అక్కడే తిరకాసు మొదలయింది..

పక్క నుండి చెవి ఆనించి విన్న మరో మంత్రిగారి గుండెల్లో బాంబులు పడ్డట్లయింది. "నిజమే -జవాబుదారీతనం... ఉద్యోగస్తులవే పనితనం... మేం ఉత్తుత్తి ప్రజాసేవకులం అని వూదరోటి... ఛ... ఛ..." అక్కసునంతా వెళ్ళగక్కాడు.

"వీడియో కాన్ఫరెన్సుల కందరూ హాజరవుతున్నారు - చెప్పేది శ్రద్ధగా వింటున్నారు - మళ్ళా సమస్యేంటి?" బాబుగారు చికాగ్గా అడిగారు.

"అయ్యో... అక్కడే వుంది అసలు పీకులాట... మీరు వీడియోలో కనబడి వాళ్ళనే అన్ని వివరాలు అడుగుతారాయె! విశేషాలు చెప్పి పనులు పురమాయించే సరికి మరి మా'లింకు' కాస్త పుటుక్కున తెగిపాయె! మీ మాట వింటానికి అలవాటు పడ్డవాండ్లు మా మాటలు చెవిన పెట్టరు గదా!" మంత్రి గునుస్తూ అన్నాడు.

"అదికాదెస్-" ఇంతకు ముందు చెవిలో గుసగుస సలిపే ఎమ్మెల్యే మరో వక్క మంత్రిగారి చెవి దొరకబుచ్చుకున్నాడు - "అద్సరే... ఇతర ప్రజాప్రతినిధులకూ.. జడ్పీ ఛైర్మన్లకూ... సర్పంచులకూ ఏ అధికారాల్లేకుండా చేసి మనం చంకలు చరుచుకున్నాం గదా... అంతే... అదే కిందనుండి పై దాకా పాకింది... అంతా అట్లా పాకింది..." చివరి 'పాకుడు' మాటలు వైరాగ్యంలో పైకే అనేయడంతో అక్కడ అందరిలోనూ ఈ 'పాకడం' అంటే ఏంటో అర్థంగాక బిత్తరపోయారు.

"ఎవరయ్యా పాకేదీ... *పాకుడేందీ... ఎవరూ?' బాబుగారు* సీరియస్‌గా అడిగేనరికి అంతా అవాక్కైపోయారు. 'పదవుల కోసం 'పాకులాడ' వద్దని మీకు రోజూ తెలియజేసుకుంటున్నాను. పదవులు చాలా ప్రమాదకరమైనవి.. మనకు శాంతి లేకుండా చేసేదే ఈ పదవుల 'పాకులాట'.

మంత్రులందరూ తలలు వట్టుకుని "జీవించేకళ" - "మౌనవ్రతం"లోని అధ్యాయాలు వినడానికి సిద్ధపడిపోతున్నారు. అపుడే ఇద్దరు మంత్రులు హడావుడిగా వగర్చుకుంటూ వచ్చిపడ్డారు. - "అర్రె... ఇవాళ ఈ సమావేశం వుందన్న సంగతి ఈ క్షణం దాకా తమ చెవినే పడకపాయె.. ఇదేంటి?" అనే విషయాన్ని విన్నవించుకునే సరికి చర్చంతా'చెవుల' మీదికి మళ్ళింది.

"చెవినపడడం... చెవులు కొరుక్కోడం చాలా ప్రమాదకరం... మనదంతా పారదర్శకం... కిందనుండి పైదాకా ప్రక్షాళన చేస్తే గానీ రాబోయే ఎన్నికలలో ప్రజలు... మన స్వయం సహాయక బృందాలు... డ్వాక్రా మహిళలు..

అపుడు మళ్ళా చర్చ రసవత్తరంగా 'కింది నుండి పై దాకా' అన్న అంశం మీదికి మళ్ళడం అందరూ హాయిగా నిట్టూర్చారు.

"కలక్టర్లు మీ మాట వినడం ప్రధానం కాదు. అసలు 'మీకు' ఈ సమావేశ 'సమాచారాన్ని' కూడా అందజేయలేదనేది నాకు చాలా ముఖ్యం. ముఖ్యమంత్రి ఆదేశాలను కూడా...

"అదే సార్... అదే... కింద నుండి పై దాకా పాకిపోయిందీ... అనే...

"పాకులాటల సంగతి వదిలేయండి... మనం ప్రజా సేవకులం... అధికార్లందరికీ వెంటనే నేను ఆదేశాలందజేస్తాను - మీ ఆధ్వర్యంలోనే వాళ్ళంతా పని చేయాలి - పనులు జరిపించేది ప్రభుత్వం - అంటే మనం... అంటే మన పార్టీ... మన పార్టే ప్రజాసేవ చేస్తుంది. ఆ విషయం కింద నుండి పై దాకా ప్రజలందరికీ వివరించాల్సిన బాధ్యత మీది! మనది ప్రజాస్వామ్యం... ప్రతి పని దగ్గిరా వచ్చచొక్కాల వారిని సమీకరించండి... ఉద్యోగుల మీద మండి పడండి... పచ్చ జెండాలు... బ్యానర్లు ప్రదర్శించండి... వాళ్ళని వెంటేసుకుని మీ వనులన్నీ చక్కబెట్టుకొమ్మని తెలియజేసుకుంటున్నాను...

అసలు ముఖ్యమంత్రిగారి సిబ్బందే వారి ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారన్న విషయం విన్నాక వారికి చాలా వినోదం కలిగింది. ఎందుకంటే తమందరికీ 'డమ్మీ'లని అపోజిషన్ వాళ్ళు ఏనాడో బిరుదులు తగిలించినారాయె! అందులోనూ టీవీలో 'ప్రజలతో ముఖాముఖి' 'జన్మభూమి ఎకాఎకి' అని ఓ కార్యక్రమం పెట్టి, చెత్తకుండీ సమస్యనుండి, చార్మినార్ భాగోతం దాకా అన్నీ బాబుగారే... అన్ని శాఖల్లోనూ బాబుగారి ఆజ్ఞలే అయినపుడు మరింక తాము డమ్మీలమో మమ్మీలమో కాకపోతే మరేంటి? అధికార్లు తమ మాట వింటారని అనుకోవడం ఎంత పొరపాటు అంచనా...

"అసలు మన 'స్వర్ణాంధ్ర' పథకాన్ని రచించింది ఎవరూ... దానిలో విజన్ 2020 సూత్రాల్నీ... దానికి తగ్గ ఆలోచన్లనీ.. ఆదేశాల్నీ అందించేదెవరూ? వేలవేల కోట్ల రూపాయలు మన ఒడిలో తెచ్చిపోస్తున్నదెవరూ? ప్రపంచ బ్యాంకు - మరి అట్లాంటి బ్యాంకు వారే నాకు క్షణక్షణం ఆదేశాలిస్తుంటే నేను తు.చ. తప్పకుండా అమలు చేసి పారేస్తున్నాను గదా... ఎందుకు? మన 'స్వర్ణాంధ్ర' సాధన కోసం! అంతే! రాష్ట్రానికి ముఖ్యమంత్రిని నేనే అయినా... ఏం చేస్తున్నాను?... మన బ్యాంకు వారి సలహాల్ని... షరతుల్ని స్వీకరిస్తున్నాను... స్వంతంగా ఆలోచన చేస్తే పైసా అప్పు పుట్టదు..."

మంత్రుల మెదళ్ళలో గుబులు మొదలైంది. బ్యాంకు వారి ఆదేశాలు బాబుగారికి... బాబుగారి ఉపదేశాలు అధికార్లకు... అంతా తిక్కతిక్కగా ఉంది. ఇంతలో చెవులు కొరికి గుసగుసలాడే ఎమ్మెల్లేగారి బుర్రకాయలో మరో మెరుపు మెరిసింది. వక్క చెవిని దొరకబుచ్చుకుని "అవునుగానీ.. నాకో అనుమానం... బాబుగారు... ఇటు అధికారులు.. బాగానే వుంది -మధ్యన మనం 'డమ్మీ'... మరీ బరితెగించి రేపు అధికారులే అటు ఐఎమ్ఎఫ్... బ్యాంకు వారితో లాలూచీ పడితే... పోనీ... బ్యాంకు వారే తమ 'పరిపాలనను' ఈ అధికారుల్తో ఈ 'స్వర్ణాంధ్ర'లో తామే కొనసాగిస్తే... ★

ఫుట్‌బాల్ ఆట పట్టేదా?

రాంప్రసాద్

దేశంలో ఫుట్‌బాల్ క్రీడకు ఆదరణ అంతంతమాత్రంగానే ఉంది. ప్రపంచ వ్యాపితంగా అత్యధికులు అభిమానించే ఈ క్రీడ మనదేశంలో దాదాపు అంతరిస్తోందనే చెప్పాలి. ఇది ఏదో ఈస్ట్ బెంగాల్ జట్టుకు, మోహన్‌బగాన్‌కు, సాల్గోకర్‌కు మాత్రమే పరిమితమైన క్రీడగా మిగిలిపోయింది. ప్రభుత్వం కూడా ఈ క్రీడను ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు అంతంతమాత్రమే. క్రీడాభిమానులు కూడా క్రికెట్, కొన్ని ఇతర గ్రామీణ క్రీడలపట్లే ఆదరణ చూపుతున్నారు. సంతోష్ ట్రోఫీ పేరుతో ఒక టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. 20 రోజులపాటు జరిగిన 58వ జాతీయ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఈనెల ఆరున ముగిసింది. ఈసారి ఈ టైటిల్‌ను పోటీలను నిర్వహించిన మణిపూర్ రాష్ట్రం గెలుచుకుంది. ఐదో తేదీన జరిగిన ఫైనల్లో మణిపూర్ డిఫెండింగ్ ఛాంపియన్ కేరళను గోల్డెన్‌గోల్ ద్వారా ఓడించి టైటిల్ ఎగరేసుకుపోయింది. వరుసగా మూడు సంవత్సరాలుగా టైటిల్ కైవసం చేసుకుంటున్న కేరళ ఫైనల్లో కంగుతింది. నూతన నిబంధన కింద ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. తమ ఫెడరేషన్లతో నమోదు చేసుకునే క్రీడాకారులనే ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఆయా ఫెడరేషన్లకు ఈ నూతన నిబంధన కల్పించింది. ఈ నిబంధన విదేశీ క్రీడాకారులు ఎక్కువగా గల రాష్ట్రాలకు ఉపయుక్తంగా మారింది. ఆయా ఫెడరేషన్లు విదేశీ క్రీడాకారులతో తమ జట్టును నింపివేసే ప్రమాదం ఉంది. ఇది దేశంలో ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఏమేరకు దోహదం చేస్తుందో అఖిల భారత ఫుట్‌బాల్ అసోసియేషన్‌కే తెలియాలి. ఏమైనా ఇరవై రోజులపాటు జరిగిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో అనేక జట్లు పాల్గొన్నాయి. ఈ నూతన నిబంధన గతంలో 29సార్లు జాతీయ ఛాంపియన్‌షిప్ సాధించిన బెంగాల్ వంటి జట్లకు అశనిపాతంగా పరిణమించింది. వచ్చే ఏడు ఈ టోర్నమెంట్ నిర్వహించేందుకు కేరళ, ఉత్తరప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాలు ముందుకువచ్చాయి. దీనిపై, ఈ ట్రోఫీలో అవకతవకలకు పాల్పడినట్లుగా ఫిర్యాదులు వచ్చిన క్రీడాకారులపై తీసుకునే చర్య గురించి చర్చించేందుకు ఫెడరేషన్ ఈ నెల 13, 14 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశం కానుంది. మణిపూర్‌తో జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ సందర్భంగా అత్యంత క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన గోవాజట్టు ఆటతీరు అత్యంత అద్భుతం.

ప్రేక్షకులు హింసాకాండకు దిగడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. ఆ సమయానికి గోవా ఆధిక్యతలో ఉంది. అయినా ఆ జట్టు క్రీడాస్ఫూర్తితో మ్యాచ్‌ను మళ్లీ తాజాగా ఆడేందుకు అంగీకరించింది. మణిపూర్‌తో జరిగిన ఫైనల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన టి.జి.పురుషోత్తం అభినందనీయుడు. రిఫరీయింగ్‌పై తీవ్ర అసంతృప్తి చెలరేగింది. నిరసన తెలిపిన తమిళనాడు, బెంగాల్‌కు చెందిన ఆరుగురు క్రీడాకారులు సస్పెన్షన్ ఎదుర్కొంటున్నారు. కేరళ ఇప్పటివరకు ఏడు సార్లు టైటిల్ గెలుచుకుంది. ఆ జట్టు సర్వీసెస్‌తో జరిగిన సెమీ ఫైనల్లో అతికష్టంమీద గెలుపొందింది. ఆ జట్టులోని ఆసిఫ్ సహీర్, అజయన్ , ఇగ్నేషియస్, నౌషాద్ రాణించారు. రెండో సెమీఫైనల్‌లో మణిపూర్ జట్టు గోవాను ఓడించింది. మొత్తం మీద కేరళ పదకొండుసార్లు ఫైనల్‌కు చేరుకుని ఆరుసార్లు టైటిల్ కైవసం చేసుకుంది. ఆరుసార్లు రన్నర్ అప్‌గా నిలిచింది. ఈసారి ఏమైనా టైటిల్ గెలవాలనే పట్టుదల మణిపూర్ జట్టులో బాగాపాతుకుపోయింది. గ్రూప్'డి'లో పడటం కూడా ఆ జట్టుకు అయాచిత వరంగా పరిణమించింది. ఈ గ్రూప్‌లో బలహీనమైన తమిళనాడు, ఒరిస్సా జట్లు ఉండటం మణిపూర్‌కు లాభించింది. ఆ జట్టులోని రెన్నెడీ సింగ్, బిజేన్ సింగ్, తోంబా సింగ్, టికేన్ సింగ్ రాణించారు. ముఖ్యంగా తోంబా సింగ్, టికేన్ సింగ్ ఫైనల్లో తమ ప్రతాపం చూపారు. తోంబా సింగ్ గోల్డెన్‌గోల్‌తో తమ జట్టుకు విజయం అందించాడు. టికేన్ సింగ్ ఆదిలో గోల్ చేసి జట్టులో ఉత్సాహం నింపాడు. బిజేన్ సింగ్ మొత్తం టోర్నమెంట్‌లో నిలకడైన ఆట ప్రదర్శించాడు. అతడు ఈ టోర్నమెంట్‌లో తొమ్మిది గోల్స్ చేశాడు. మణిపూర్ జట్టు టైటిల్ గెలుచుకోవడం ఇదే మొదటిసారి. రతన్ సింగ్ నేతృత్వంలో జట్టు ఈ ఘన విజయం సాధించింది. లెఫ్ట్‌బాక్ ఉత్తమ్ కుమార్ సింఘా ఆదిలోనే అందించిన పాస్‌తో టికేన్ సింగ్ గోల్ చేయడం కేరళ క్రీడాకారులను నిరుత్తరులను చేసింది. అబ్దుల్ నౌషాద్ 89వ నిముషంలో చేసిన గోల్‌తో స్కోరు సమానమైంది. తరువాత ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. తోంబా సింగ్ గోల్డెన్ గోల్ చేసి తమ జట్టుకు చిరస్మరణీయమైన విజయం అందించాడు. ఈ క్రీడాకారునికి ఉజ్వల భవిష్యత్ ఉంది. అతని అంకిత భావం చూడముచ్చటగా ఉంది. మిడ్‌ఫీల్డ్‌లో అతడు చురుకుగా కదిలే తీరు అందరికీ పాఠం నేర్పే విధంగా ఉంటుంది. మణిపూర్ జట్టులోని జేమ్స్ సింగ్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గానూ, తోంబా సింగ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ ఎంపికయ్యారు. ఏమైనా మణిపూర్ జట్టు సాధించిన విజయం అందరికీ ప్రేరణ కావాలి. ప్రతి ఏడాది సంతోష్ ట్రోఫీని నిర్వహించి తమ బాధ్యత అయిపోయిందన్నట్లు ఫుట్‌బాల్ ఫెడరేషన్ చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రతిభను కాగడా పట్టి వెతికి ప్రోత్సహించాలి. అపుడే దేశంలో ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధి జరుగుతుంది. క్రికెటర్లకు చూపించే రాయితీలను, ప్రోత్సాహకాలను ఫుట్‌బాల్ క్రీడాకారులకు కూడా వర్తింపచేయాలి. ★

సైదులు ఐనాల

పోస్టు చెయ్యని ఉత్తరం



"ఛీ! ఛీ! పొద్దున్నే దాని పేరెత్తకు! పాడుది. తను చెడింది గాక మనకుటుంబాన్నీ వీధిపాలు చేసింది. ముదనష్టపుముండ" సాగదీసిన నోరు మూతపడకుండానే, వడగండ్ల వర్షంలో రాళ్ళలా, ఇంకా ఏవో తిట్లు తిట్టుకుంటూనే బామ్మ ఇంటా బయటా కలియతిరుగుతుంది. "నేనేమన్నాననే! హైదరాబాద్ నుండి ఇంటికి రాగానే అందర్నీ పలకరించా ఒక్క వదిన్ను తప్ప. ఇంటికొచ్చిన దగ్గర్నుంచి ఇల్లంతా కలియజూశాను. ఎక్కడా జాడలేదు." ఎప్పుడూ తాను రాగానే చేతిలో లగేజ్‌ని అందుకొని "ఎలా సాగిందీ ప్రయాణం?" దగ్గర్నుంచి కాలేజీలో విషయాల దాకా గుచ్చిగుచ్చి అడిగేది. నోటినిండా నవ్వేది. నన్నూ నవ్వించేది. 'అమ్మ'లా లాలించేది. అన్ని విషయాల్లో ఆప్తురాలయ్యేది. ఒక్కోసారి తనూ ఏదో చెప్తుండేది. అంతగా నేవినేవాణ్ణి కాదు. అయినా చెప్తూనే ఏడ్చేది. ఏడుస్తూనే చెప్పేది. అవన్నీ ఆడవాళ్ళకి సహజమేనని వాడిని కొట్టి పారేసే "అసలలాంటి భావనల్లేకపోతే ఆడదానికి ఓర్పెలా వస్తుంది" అప్పుడప్పుడూ నాన్న అమ్మననే మాటలు గుర్తొచ్చేవి. "నిజమే! కష్టాలు ఆడదానికి కాపోతే మరెవరికొస్తాయ్! మొగుడు పౌరుషమున్న మగాడు. తన పురుషత్వాన్ని చూపొద్దూ!" ఛీ! ఎంత నీచంగా ఆలోచించాను. పురుషుడనన్న అహంకారంతో ఎప్పుడూ వదిన మాటల్ని పట్టించుకోలేదు. కనీసం ఒక్కసారైనా వినాల్సింది. ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముట్టాయి. "ఆడది అణకువగా ఉండాల్సింది పోయి బరితెగించి వెళ్తదా? మొగుడొద్దుట, కొడుకూ వద్దట. ఎవరూ లేని ఒంటరి జీవితం కావాలట. ఎంత మాటలు. నోరు పట్టని మాటలని పొయ్యింది. ఎవ్వరికీ చెప్పకుండా రాత్రికి రాత్రే ఎవ్వడితోనో లేచిపోయింది. పోయింది. అంతా పోయింది. గుట్టుగా సాగే నా కుటుంబం పరువంతా ఈదినపడ్డాది" బామ్మ నెత్తీ నోరు కొట్టుకుంటూ చెప్తుంది. ఎందుకో, బామ్మ మాటల్లో నిజం లేదన్పిస్తుంది. వదినమ్మ అలాంటిది కాదు. నాకు తెల్సీ అలా చెయ్యదు. ఎంతో మంచిది. మాటల్లో చెప్పలేని మనసు గలది. "ఏమో అన్నయ్య లేకపోవడంతో అలా ఎందుకు మారకూడదూ!? నిజమే వదిన వయస్సు చూస్తే నిండా ఇరవై అయినా దాటలేదు. వయస్సుని ఆపుకోలేక కోర్కెల్ని చంపుకోలేక లేచిపోయిండొచ్చు. ఛీ! ఆ మాట అనుకున్నది తనే" ఒళ్ళంతా కంపరం. "ఎంతపని చేసిందీ! మంచిగా ఎంతో మంచిగా ఉన్నట్లు నమ్మించింది. కాదు కాదు నటించింది. మోసం చేసింది. ఆడదానికి బయటి ప్రపంచం చూపిస్తే అన్నింటినీ వదిలేస్తుంది" నాన్న నోటినుంచి దొర్లిన ఒకప్పటి మాట. జ్ఞాపకం వచ్చి ఒళ్ళు జలదరించింది.

"అంటే రాత్రికి రాత్రే చెప్పకుండా వెళ్ళిందా? అలా ఎందుకు చేసిందీ? అస్సలెవరితో వెళ్ళిందీ! కనీసం తనకో కొడుకున్నాడన్న సంగతి కూడా గుర్తు రాలేదా! వదిన గదిలోకి నడిచాను. అలమరానిండా వదిన చీరలే. పెట్టె నగలతో నిండుగా ఉంది. బీరువాలో డబ్బూ ఉంది. అంటే నగలు, డబ్బు, చీరలూ ఇవేవీ కాదని మరిదేని కోసం వెళ్ళింది? మెదడును తొలుస్తున్న ప్రశ్నల పర్వం. వదిన చీర మడతల్లోంచి ఓ తెల్ల కాగితమొకటి జారిపడ్డది. అందుకొని మడత విప్పాను. చాలా పొందికగా ఉన్నాయి అక్షరాలు. కరెక్ట్‌గా వదిన ఇల్లు విడిచి వెళ్ళడానికి ముందురోజే అన్నయ్యకు రాసిన ఉత్తరం. 'పోస్టు చెయ్యని ఉత్తరం'. నా కళ్ళు వేగాన్నందుకున్నాయి.

నేను క్షేమం, నీ ఉత్తరమూ క్షేమం. స్నేహితులూ క్షేమమే. ఇప్పుడు ప్రతీ జీవితం ప్రాతః కాలమందున పత్రంపై మంచుబిందువు ఉన్నంత కాలం సూర్య కిరణాల్ని ఇంద్ర ధనస్సుల్ని చేసి మైమరిపిస్తుంది. అంతలోనే ఆవిరైపోతుంది. కానీ ప్రకృతిలో ఏదీ వృథాకాదు కదా! ఆవిరి వర్షబిందువై భూమి దాహార్తిని తీర్చే మాతృత్వమవుతుంది. ఎంతకీ తెగని పేగు బంధంలా.

మొన్న నీవు రాసిన ఉత్తరం చదివి చాలా సంతోషించాను. ప్రతీక్షణం ఆనందానుభూతమయం. ఎందుకో ఏదో కోల్పోతున్నట్లు, ఎంతకీ అర్థం కాని క్షణాలు కొన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తూ జీవితంతో ఆటాడుకుంటాయి. మన ఇరువురి కలయికకు తీపో, చేదో ఏదైతేనేం ఓ ప్రతిబింబం. అత్తవారికి చిరుదీపం. ఎందుకో వాడిని చూసినంత ప్రేమగా నన్ను చూడడం లేదనడం కంటే చూడలేకపోతున్నారన్నది నిజం. ఏది ఏమైనా నా ఈ కల్లోల సామ్రాజ్యానికి రాజైనా, బటుడైనా వాడేనన్నది నా ఆశ. అందుకే వాడంటే ఎందుకో నాక్కూడా ప్రాణమే.

మన ఇంట్లో రోజురోజుకీ నేను పరాయిదాన్నవుతున్నానేమోనన్న భయం నా వెన్నులో ఒణుకు పుట్టిస్తుంది. నేనంటే మన బాబుకు రోజుకొక విధంగా చెప్తున్నారని మీకు చెప్పడం లేదుగానీ, నన్ను నేనుగా గుర్తించుకో లేక, నా అస్థిత్వం కోల్పోతున్నట్లుగా మాత్రం గుర్తిస్తున్నాను. అందుకే వెంటనే పెన్ను అందుకొని ఈ ఉత్తరం రాస్తున్నాను. నేనేదైనా చెప్పుకోవాలన్నా, నా బాధను, బరువును దించుకోవాలన్నా మీరొక్కరే కదా ఆదరువు! అందుకే గతంలో లాగా ఇదంతా చాదస్తం అని మాత్రం కొట్టి పారేయరని నా నమ్మకం. తగిన సూచనలు, సలహాలు ఇస్తారని ఆశిస్తున్నాను.

చివరిగా ఓ విషయం మర్చాను. మొన్న ఏం జరిగిందో తెలుసా! ఉప్మాలో కొద్ది ఉప్పు ఎక్కువ అయిందని ఛీ! నాకీ అమ్మ ఒద్దు. "నానమ్మా ఇంకో అమ్మని తీసుకురా" అని చింటూ అనేసరికి నా గుండెల్లో ఒణుకు పుట్టింది. ఆడపడుచు, అత్తగారు అదేదో జోకయినట్లు పొర్లిపొర్లి నవ్వారు. కనీసం మాట

కథ

మాత్రంగానైనా వారించలేదుకదా! "సరే నాన్నా సాయంత్రం మీ నాన్నకు ఫోన్ చేసి నేను చెప్తాగా! ఈ పూటకి తినేసెయ్యమ్మా" అంటూ మీ అమ్మ వాడికి టిఫిన్ తినిపిస్తుంటే నా కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. నా ప్రేగు త్రెంచుకు పుట్టిన వాడే నా బంధాన్ని తెంచుతాడేమోనని అల్లాడిపోయాను. "మీరు అనుకోవచ్చు. చిన్న పిల్లవాడు ఏదో తెలియకన్నాడు కదా! అంతమాత్రం దానికి ఇంత పెద్ద ఆలోచనా!" అని. కానీ వాడు నా ఒడిలో కూసంతైనా సేద తీర్చుకోవడం లేదంటే ఓ తల్లిగా నా బాధను ఎలా చెప్పను. అక్షరీకరించలేని నా చేతగానితనాన్ని క్షమిస్తారనే అనుకుంటున్నాను. ఇన్ని రోజుల నుండీ ఓపిక పట్టాను. ఇక సహించలేకున్నాను. మీరు ఈ సంవత్సరంలో వస్తానన్నారు కదా అని ఏ నిర్ణయం తీసుకోలేదు. కానీ మీరు ఉత్తరాల ద్వారానే ఎప్పటికప్పుడు వాయిదాలు వేస్తున్నారు. నా సంసార జీవితంలో ఎప్పుడూ వాయిదా వస్తువులే కొనడానికి ప్రయత్నించేదాన్ని. కానీ చివరికి నా జీవితమే ఓ వాయిదాల నిరీక్షణ అవుతుందని కలలో కూడా ఊహించలేదు. మొదట్లో మూడు నెలలే కదా ఇట్టే గడిచిపోతుందన్నారు. ఆ తరువాత కొత్త బ్రాంచ్ కదా సెట్ కావడానికి కొంత సమయం పడ్తుంది. కాస్త ఓపిక పడితే రెక్కలు కట్టుకొని వస్తానన్నారు. అలా అలా, మీ వాయిదాల ఉత్తరాలకు అలవాటు పడ్డ నాకు చివరకు నా కొడుక్కూడా వాయిదాల పద్ధతిలో నన్ను దూరం చేస్తాడేమోనన్న ఆలోచన కలవరపెడ్తోంది. పదే పదే తలచుకుంటూ నిద్రలేని రాత్రుళ్ళు కోకొల్లలవుతున్నాయి. అన్నీ ఉన్నాయి. కట్టుకోవడానికి చీరెలు, నగలు, ఇంటి నిండా మనుషులు, ఇంకా ఇంకా అనేకం.

కానీ కావల్సింది జీవితానికో అర్థాన్నిచ్చే 'ప్రేమ'ను మాత్రం పొందలేకపోతున్నాను. భార్యగా భర్త నుండి, తల్లిగా సంతానం నుండి ప్రేమను పొందాలనుకోవడం దురాశకాదు కదా? ఇంట్లో ప్రతీ వస్తువుల వాయిదాలు నెలకొకటి తీరిపోతుంటే నా గుండెల్లో పరుగులు, చెయ్యి పెట్టి కెలికినంత, విచలితంగా ఉంది. రోజు గడిస్తే చాలు. జీవితంలో ఓ పేజీ చిరిగినట్లేననిపిస్తుంది. ఎప్పుడు నాకూ నా కొడిక్కీ వాయిదా తీరుతుందోనని, ఏ సమయంలో ఆ మాట వినాల్సి వస్తుందోనని నా మనస్సు తల్లడిల్లిపోయింది. అందుకే మీరు ఈసారైనా వచ్చి తల్లి ప్రేమంటే ఏమిటో చెప్తారని ఆశించాను. కానీ కాలమే ఏదో నేర్పినట్లుంది. పురుషాధిక్యతా సమాజం స్త్రీని ఎప్పుడూ ఒక్కడుగు కూడా ఎదగనివ్వదని. ఏమైతేనేమి నా చుట్టూ సాలెగూడు అల్లిందీ సమాజం. ఎంత సహజత్వమో కద్దండీ!" ఆడది ఎప్పటికైనా అక్కడిదే గాని ఇక్కడిదవుతుందా మాష్టారూ!" "ఇంకేం చదువు ఆమె ఏమన్నా ఊళ్ళేల్తదా? ఏదో ఓ అయ్య చేతిలో పెట్టి భారందించుకోక" "ఏంటే మగాడిలా ఆ గంతులు, ఆ మాటలు" "ఇదేం చోద్యమో అమ్మా! మా అప్పుడు ఆడది అణకువగా ఉండేది. భర్త మొఖం తప్ప మరే పరాయి మగాణ్ణి చూసేది కాదు!" "ఇదేం పోయే కాలమో మగాళ్ళ లెక్క నూటుబూట్లేసి బజారెక్కుతున్నారు" తరతరాలుగా ఈ మాటలు విని చెవులు చిల్లులు పడ్డాయి. ఈ మాటలే కదూ! నన్నూ, నా స్త్రీత్వాన్ని, నా పాతివ్రత్యాన్ని కాపాడుతూ వచ్చాయి? ఈ బూజుమెదళ్ళే కదూ! నన్ను ఇన్నాళ్ళు ఎక్కడో ఉన్న మగని కోసం 'భార్య', 'పతివ్రతైన భార్య', "చాలా మంచి భార్య బానిస పుట్టు బానిసకు కూడా ఎప్పుడన్నా ఒకప్పుడు స్వేచ్ఛ దొరుకుతుంది. మరి నాకూ!? వయసొచ్చేంత వరకూ నా ఎనక పుట్టినోడు నా పాతివ్రత్యాన్ని కాపాడాడు. ఆ తరువాత నీవు. నీవు ఎక్కడికో ఉద్యోగం పేరు చెప్పి వెళ్ళి వెళ్ళగానే నా కొడుకు నా రక్తం పంచుకుపుట్టిన వాడు నన్ను, నా పాతివ్రత్యాన్ని కాపాడ్తాడట. "ఇదంతా చూస్తుంటే నాకో అనుమానం కలుగుతుంది. అసలు పాతివ్రత్యమంటే ఏమిటి? అదో మనిషి రూపమా! మనిషిలో ఉండే మనసు రూపమా! మనిషయితే మార్పుండాలి! మరి మనస్సయితే చలించాలే." మరేదీ కానప్పుడు నీకు మాత్రం లేనప్పుడు నాకు మాత్రమే ఎందుకూ!!?

ఏంటి నాకేమన్నా పిచ్చి పట్టిందనుకుంటున్నావా! అవును ఇది నీకు పిచ్చిగానే అనిపించవచ్చు. ఎందుకంటే కొన్ని తరాలుగా నా జాతిని

ఆచారాల పేరుతో, కట్టుబాట్ల పేరుతో కట్టేశారుగా! ఇప్పుడా కట్టుబాట్లను, ఆచారాల్ని ఎడమకాలితో తన్ని ఇంటి బయటకొస్తుంటే సహజంగానే సమాజం నన్ను పిచ్చిదంటారు. అననీయండి. ఇన్నాళ్ళూ మూగదానిలా వంటింట్లో మంచు పొగకి ఊపిరాడక పిచ్చిదాన్నయ్యాను. ఇప్పుడు బయటకొచ్చి స్వేచ్ఛా వాయువుని పీలుస్తున్నాను. దీనికి ఈ సమాజం ఏ పేరు పెడ్తే నాకేటి. పిచ్చిదే అననీ, చెడిపోయిందననీ, బజార్నపడ్డదననీ. ఏమంటే నాకేం ఇన్నాళ్ళూ నాకో అస్థిత్వం లేదు. ఒకరి దయాదాక్షిణ్యాలు తప్ప. ఇప్పుడు నాకో అస్థిత్వం. నాకో మనస్సుందని తెలిసింది. నేనూ ఓ మనిషినేనని గుర్తించుకున్నాను నన్ను నేనే".

ఉత్తరం చదవడం పూర్తవకముందే నా వెన్నులో వణుకు మొదలైంది. ఓ పక్క వదినపై అభిమానం. మరో పక్క వదిన మనస్సులో చెలరేగిన ఆలోచన్ల ఆర్ద్రతని అర్థం చేస్కోవడంతో ఏమైపోయిందోనన్న భయం.

ప్రశాంతంగా కుర్చీలో కూర్చున్నాను. కొంతసేపు గదిలో మౌనం. పదేపదే వదిన రాసిన ఉత్తరాన్ని తిప్పి తిప్పి చూశాను. చదివిన ప్రతిసారీ వదినతో మాట్లాడుతున్నట్లుంది. మళ్ళీ మళ్ళీ చదవాలనిపించింది. "అరే సీనూ" బామ్మ కేకతో ఈ ఉత్తరాన్ని మడిచి అలమారలో ఉంచి బయటకొచ్చాను.

క్షణాల్లో స్నానం, భోజన కార్యక్రమాలు ముగించుకొని వీధిలోకి బయలుదేరాను. నా ప్రయాణం ఎక్కడికీ? ఎందుకూ? సమాధానం అక్కడికెళ్తేనే తెలుస్తుందనుకున్నాను. ఆతృతగా ఉంది. బుర్రలో ఓ ఆదర్శాన్ని ఆచరిస్తున్న మహిళ గురించిన ఆలోచన్లు. వడివడిగా బస్‌స్టేషన్ కొచ్చాను. నాకు కావల్సిన బస్సు కనపడగానే ఆత్రంగా ఎక్కి వెనక సీట్లో కూర్చున్నాను.

బస్సు వెళ్తోంది. కిటికీలోంచి చల్లని గాలి రివ్వుమంటోంది. చాలా సేపు బస్సు అడవిలోనే నడిచింది. చుట్టూ చెట్లు, దూరంగా కొండలు. ఆకాశం నిర్మలంగా ఉంది. చీకటి పడ్తున్నట్లుంది. పక్షులు చెట్లకు చేరుతున్న అరుపులు. గాలిని చీల్చుకుంటూ బస్సు వెళ్తోంది. బస్సు ఆగగానే ఆలోచనలన్నీ అదాటున కుదేసినట్లు ఆగాయి. బస్సు దిగి అటూ ఇటూ చూశాను. ఎప్పుడో మూడు సంవత్సరాల క్రితం వదినతో వచ్చాను ఈ ప్రాంతానికి. మళ్ళీ ఇప్పుడు ఇలా. కొంతసేపటికి ఎటువైపు నడవాలో ఆనవాలు దొరికింది.

నాలుగు ఫర్లాంగుల నడక అనంతరం ఓ భవనం కన్పించింది. ఆ ప్రాంతానికి దగ్గరవుతున్న కొద్దీ మాటలు విన్పిస్తున్నాయి. గేటు తీస్కొని ఆవరణలోకి అడుగు పెట్టాను. ఓ కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లుంది. చుట్టూ ఆ పచ్చని చెట్లు. చల్లని గాలి. ఆవరణలో నియాన్ లైటు వెలుగుల్ని నింపుతూ నిగర్వీగా నా వైపు చూస్తూ ఆహ్వానిస్తున్నట్లు మూడు సంవత్సరాల నా జ్ఞాపకాలు మళ్ళీ మదిలోకొచ్చాయి. ఎవ్వరికీ చెప్పొద్దని ఆ రోజు వదిన నాతో ఒట్టేయించుకుంది. ఇందుకేనేమో..

'మదరిండియా విడో కేంద్రం' మెరుస్తున్న అక్షరాల్ని చూసేసరికి ఆత్మీయుల్ని చూసినంత ఆనందమేసింది. లోపలికి అడుగు పెట్టగానే వదిన కన్పించింది. ప్రాణం లేచొచ్చినట్లయింది. గదిలోపల ఏదో సమావేశం జరుగుతోంది. వదిన ఏదో చెప్తుంటే అందరూ వింటున్నారు. అందరి ముఖాల్లో ఏదో సాధిస్తామన్న ధీమా కొట్టొచ్చినట్లుంది. గుమ్మం ముందరే ఆగాను. ఎప్పుడు చూసిందో వదిన నా దగ్గరకొచ్చి తల నిమురుతూ "ఎప్పుడొచ్చావ్! శ్రీనూ? ప్రయాణం బాగా సాగిందా?" ప్రశ్నల వర్షం. అన్నింటికీ జవాబు నా కళ్ళలో కన్నీళ్ళే అయ్యాయి.

"ఇంక రావా వదినా?" వెక్కెక్కి ఏడుస్తూనే అడిగాను. "ఎక్కడికీ?"

"మన వాళ్ళ దగ్గరికి"

"మరి వీళ్ళంతా???"

నా జీవితం చాలదు ఆ ప్రశ్నకి జవాబు చెప్పడానికి. అందుకేనేమో మారు మాట్లాళ్ళేక పోయాను!

★

చూసిన 'సినిమా'లూ.. కమామిషు

ఆధునిక జీవితం, ఆధునిక విజ్ఞాన శాస్త్రం, ఆధునిక కళా శాస్త్రం... అంటూ అనేక 'ఆధునిక వారసత్వాల' ఫలితంగా సినిమా అనే అతి విచిత్రమైన, అద్భుతమైన కళారంగం ఆవిష్కారమైంది. చరిత్ర మనకు ప్రసాదించిన కళాస్వరూపాలన్నీ సినిమాలో 'కలిసి పోయాయి' సినిమా అంటే ఏమిటి? అన్న ప్రశ్నవేసుకున్న వారికి... అదొక వైజ్ఞానిక, సాంస్కృతిక కళారూపం అని మాత్రం ఎవరైనా చెప్పొచ్చుకాని, సినిమా కళకు వేరే వ్యాకరణం, వేరే శిల్పం, వేరే శక్తి... ఉన్నట్టుగా స్ఫురించదు. అదే సినిమా విజయం. సినిమా వినోదం. అంతేకాక మానవ జీవితపు ఆల్జీబ్రాకూ, మానవహృదయపు జ్యామెట్రీకీ, మానవుని మేధాసంపదకూ ప్రతిబింబమే సినిమా. అన్ని సినిమాలకూ (అంటే చలనచిత్రాలకూ) ఈ అంచులు అన్నీ ఉన్నాయని కాదు. మిగతా కళలేవీ... మనకు బట్వాడా చేయలేని అంశాలను సినిమా కళ ప్రసారం చేయకలదు. ఇది నిజంగా అత్యంతాధునిక కళ. జీవితం దర్శించే, భరించే, భరించలేని,.. ఉద్వేగ ప్రపంచాలను సినిమా ఆవిష్కరించకలదు.

క్రాంతికుమార్ 'ప్రపంచ సినిమా' తాలూకు వివిధ చిత్రాలను చూసి, అనుభవించి పలవరించిన వ్యాసాలు 'అద్దం' పుస్తకంలో చదువుకోవచ్చు. ప్రపంచం మూడు కొలతలలో కనబడుతుంది. నాలుగు కొలతలలో అర్థమవుతుంది. అంతేకాక వర్ణాలుంటాయి, శరీరక, మానసిక లోకాలు ఏర్పడిపోతాయి. అర్థాలూ, అనర్థాలూ మనలను తాకుతాయి. ఇలా అనడం కూడా తప్పేమో.. మరీ గొప్ప సినిమా అయితే మనను తనలోకి 'గుంజుకుంటుంది'. మనకు తెలియని ప్రపంచం, 'మనకు ఎంతో బాగా తెలిసిన ప్రపంచం' లాగా బాధిస్తుంది. సంతోషపెడుతుంది. దుఃఖపెడుతుంది. మన వ్యక్తిత్వాన్ని 'కొద్దిగా' మారుస్తుంది. ఏ ఇంద్రజాలానికీ లేని శక్తికల సినిమానూ, సినిమాలనూ 'క్రాంతికుమార్' చక్కగా పరిచయం చేశారు. సీరియస్ సాహిత్యం కంటే, సీరియస్ సంగీతం కంటే... సీరియస్ సినిమా మనల్ని ఆవహిస్తుంది. బాధపెడుతుంది. మామూలు సినిమాలకూ మనకూ ఏమీ సంబంధం ఉండదు. మంచి సినిమాకూ మనకూ బంధం... విడదు. అదొక గౌతముని జ్ఞాన యాత్ర. అప్పుడప్పుడు ఆనందయాత్ర. వెరసి అమోఘమైన అనుభవ సంపద. క్రాంతికుమార్‌కు పట్టిన 'సినిమా పిచ్చి'లో యావత్ప్రపంచమూ ప్రత్యక్షమవుతుంది. అతని యాత్ర ముగియదు. 'అద్దం' పుస్తకంలో కొన్ని డజన్ల గొప్ప చిత్రాల ఊసు ఉంటుంది. అతని యాత్ర ఇంకా కొనసాగుతుందని ఆశ... తల్లులూ, తండ్రులూ, సోదరులూ, ప్రేయసులు, ప్రియురాళ్ళు... మనిషికంటే ఎన్నో రెట్లు హీనపడడమూ, ఎన్నెన్నో రెట్లు పెరిగిపోవడమూ.. ఈ సినిమాలలో చూడొచ్చు. చూడండి. క్రాంతికుమార్ పెరిగే క్రమంలో రచించిన ఈ సమీక్షలు అతనికి ఎంతో తోడ్పడతాయి... మనకూ స్ఫూర్తినిస్తాయి.

అద్దం ప్రపంచ సినిమా వ్యాసాలు

రచన : కె.క్రాంతికుమార్; **వెల :** రు. 50/-;
ప్రతులకు : రచయిత త్రివేణి హాస్టల్, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ రోడ్, హైదరాబాద్.

ఈ సినిమాలు కట్టుకథల మీదా, చమత్కారాల మీదా ఆధారపడ్డ చలన చిత్రాలు కావు. ఇవి 'జీవిత చలన చిత్రాలు'.. చదివిన వారికి చదివినంత ... సినిమా చూడ్డానికి స్పష్టమైన దృష్టి ఏర్పడుతుంది ఈ పుస్తకం వలన...

- హరి

పురాణ విమర్శ

రాజ్యానికున్న రక్షణ వ్యవస్థ భౌతికంగా ప్రజలను నయానో, భయానో అణచి వేయడానికి ఉపయోగపడుతుంది. మానసికంగా ప్రజలను అణచిపెట్టడానికి మతం ఒక ప్రధాన ఆయుధంగా తయారైంది. మత వ్యవస్థలో భాగంగా రచింపబడిన పురాణాలు, నీతి శాస్త్రాలు, చట్టాలు, ఆలోచనా శక్తికి, కార్యశీలతకు కళ్ళెం వేస్తాయి. వీటిని అధ్యయనం చేయడం ద్వారా, అవి ఏ విధంగా సమాజంలోని నిగూఢమైన దోపిడీ విధానాన్ని న్యాయబద్ధమని ప్రజలను మభ్య పరుస్తుందో దాన్ని బయటపెట్టాల్సిన అవసరముంది.

కృతయుగం (ఒక వక్రీకరణ)
రచయిత : ప్రొఫెసర్ కె. శేషాద్రి,
వెల : రు. 10, **పేజీలు :** 54
ప్రచురణ మరియు ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాద్

మన పురాణాలను దైవజోక్యం లేకుండా మానవుల కథగా వింగడించి, ఆనాటి వర్గ వైషమ్యాలను విశ్లేషించాలనే కృషిలో భాగంగా వెలువడిందే ఈ చిరుపొత్తం.

ఎడతెగని పోరాటమే చరిత్ర యొక్క చోదక శక్తి, ఒక సమాజానికి ఇంకొక సమాజానికి మధ్య ప్రకృతి వల్ల కలుగు ఫలితాన్ని అనుభవించేందుకు పోటీ. ఒకే సమాజంలోని అన్ని ఫలాలు అనుభవించి తమ శక్తిచేత కొందరిని బానిసలుగా చేసి వారిని దోపిడీ చేయడం ఇంకొక అంశం.

భాష విషయంలో ప్రొఫెసర్‌గారు మరింత శ్రద్ధ తీసుకుంటే బాగుండేది. వారు అక్కడక్కడ ఉపయోగించిన హాస్యధోరణి, వ్యంగ్యపు చురకలు పఠనంలోని సీరియస్‌నెస్‌ను తగ్గించడానికే తోడ్పడతాయి.

- కె.పి.అశోక్ కుమార్

వ్యాకారం

కార్టూన్లు ఏ రంగానికి సంబంధించిన అంశాన్నైనా సమర్థవంతంగా వెంటనే ప్రజల మనస్సుకు హత్తుకునేలా వ్యాఖ్యానిస్తాయి. ప్రస్తుత గ్రంథంలోనూ మత సామాజిక, రాజకీయ, సాంస్కృతికాది రంగాలకు చెందిన 116 కార్టూన్లు వున్నాయి.

116 నవ్వులు

కార్టూనిస్ట్ : పెండెం జగదీశ్వర్; **వెల :** 16/-;
ప్రతులకు : బూరుగు వెంకటేష్, కన్వీనర్, హాస్యప్రియుల వేదిక, రామన్నపేట, నల్గొండ జిల్లా

దంతాలు - ఆరోగ్యం

రచన : డా॥ కె.ఎల్.వి.ప్రసాద్; **వెల :** 50/-;
ప్రతులకు : శ్రీమతి కె.అరుణ కుమారి; సంరక్ష పబ్లికేషన్స్, 24-7-322/5, సహృదయ మార్గ్, రామకృష్ణకాలనీ, ఆర్ఇసి పోస్ట్, హన్మకొండ-4